సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం ౹ 21 ౹ నవంబర్ ౹ 2024



ముందస్తు జాతీయ లోక్ అదాలత్

పోలీసు అధికారులతో జిల్లా కోర్టు ఆవరణంలో బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ముందస్తు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. -8లో



హత్య కేసులో నిందితుల అరెస్టు

మంచాల వెంకటయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం వివరాలను వెల్లడించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.8/21.3

జిల్లాలో బుధవారం 21.3 - 29.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు శుక్రవారం నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో త్రోబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 22న పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌లో బీచ్ వాలీబాల్ అండర్-14, అండర్-17 బాల బాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రోబాల్ ఎంపికలకు ఫిజికల్ డైరెక్టర్ ప్రదీప్‌ను 7981472484 నెంబర్‌లో, బీచ్ వాలీబాల్ ఎంపికలకు ఎల్.ఎ. సునీల్‌ను 98497 20930 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

23న కబడ్డీ జిల్లాస్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 23న జిల్లాస్థాయి కబడ్డీ సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి. శ్రీవాణి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 63043 09294, 9949304160 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

24న రాష్ట్రస్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 24వ తేదీ రాష్ట్రస్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. టోర్నీ విజేతలకు రూ.53 వేల మేర నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్ అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటర్లుగా ఎం.గోపీనాథ్, రామ్‌లు హాజరవుతారని తెలిపారు. వీరితో పాటు రాష్ట్రంలోని చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 83412 55151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



ఎంఈఓల-1 అసోసియేషన్ నూతన కమిటీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఉండే మండల విద్యాశాఖాధికారులు -1 సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఈఓ-1 నూతన అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిద్దకుంట గంగిరెడ్డి, పద్మలత పేర్కొన్నారు. బుధవారం కడపలో జరిగిన ఎంఈఓ-1 జిల్లా సమావేశం సందర్భంగా జిల్లా ఎంఈఓ-1 అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎంఈఓ-1 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా దిద్దకుంట గంగిరెడ్డి(కడప ఎంఈఓ-1) ప్రధాన కార్యదర్శిగా పద్మలత(మైదుకూరు), గౌరవాధ్యక్షుడిగా విలియమ్స్‌రాజ్ (అట్లూరు) ట్రెజరర్‌గా జీఎల్‌వీఎస్ శివప్రసాద్ (ఎర్రగుంట్ల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రిమ్స్ సూపరింటెండెంట్ రాజకీయ బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: కడప సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జీజీహెచ్ సూపరింటెండెంట్ (ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డిపై రాజకీయ బదిలీ వేటు పడింది. ఆయన్ను బదిలీ చేస్తూ రాష్ట్ర హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ బుధవారం జీఓ ఆర్‌టీ నెంబరు 701 విడుదల చేసింది. ఆయనను పాడేరు జీఎంసీలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రతిపాదనల మేరకు బదిలీ చేసినట్లు ప్రభుత్వం తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రిమ్స్ డెంటల్ కళాశాలలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమానికి కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి హాజరయ్యారు. అక్కడ అధికారులు తమకు ప్రోటోకాల్ పాటించలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి మంత్రి సవిత అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డితోపాటు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సురేశ్వర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. నిజానికి ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేని ఆయనను రాజ కీయ కక్షతో బదిలీ చేశారనే విమర్శలు వినబడుతున్నాయి.

సీమ ముంగిట కొత్త పంట

వ్యవసాయం భారంగా మారుతున్న వేళ ఆయిల్‌పాం సాగు సాయంగా నిలుస్తోంది. నిత్యం కష్టాలు..నష్టాలతో అలిసిపోయిన సీమ రైతుల కళ్లల్లో ఆశలు నింపడానికి బిరబిరా వస్తోంది. వర్షాల్లేక.. పంటలు రాక బీడుగా కనిపించే సీమ చేలల్లో ఆయిల్‌పామ్ నిండుగా కనిపిస్తోంది.

- 'ఆయిల్ పామ్' సాగుతో సిరులు!
- జిల్లాలో 500 ఎకరాల్లో సాగుకు శ్రీకారం
- ఇప్పటికే 150 ఎకరాల్లో సాగు.. 4 ఏళ్ల నుంచి దిగుబడి
- పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం
- హెక్టారుకు రూ. 71 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఆర్థికసాయం



కాశినాయన మండలంలో సాగులో ఉన్న అయిల్‌పామ్



కడప అగ్రికల్చర్: పెరిగిన ధరలు, సాగు ఖర్చులతో నేడు వ్యవసాయం రైతన్నలకు భారంగా మారు తోంది. ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తు న్నా ఏదో విధంగా నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. ఈ కష్టతర వ్యవసాయం నుంచి రైతన్నలను గట్టెక్కించేందుకు ఉద్యానశాఖ కసరత్తు చేస్తోంది. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలిక రాబడి వచ్చే పంటలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటసాగుకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీలను అందచేస్తూ సాగుపై రైతన్నను సమాయత్తం చేస్తోంది.

జిల్లాలో సాగుకు శ్రీకారం...

ఆయిల్‌పాం సాగును జిల్లా రైతులు శ్రీకారం చుట్టారు. జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పలు ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో పంట సాగైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ జిల్లాలోని బిమఠం, మైదుకూరు, పొద్దుటూరు, కాశినాయన, పులివెందుల మండలాల పరిధిలో 500 ఎకరాల్లో పంట సాగు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకుగాను జిల్లా ఉద్యానశాఖ అధికారలు ఆయిల్ పామ్ సాగుపై రైతన్నలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ రైతన్నలను ప్రోత్సహిస్తోంది. ఇందులో పంటసాగు.. వాటి నిర్వహణ, ప్రభుత్వ ప్రోత్సాహం, దిగుబడి .. రాబడి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలోని ఎంపిక చేసిన మండలాల పరిధిలో 150 ఎకరాల్లో పంట సాగును చేపట్టారు.

- పంట సాగు నుంచి నాలుగేళ్ల తర్వాత దిగుబడి మొదలవుతుంది. 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఖర్చులు పోనూ ఎకరాకు సుమారు లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం ఉంటుందని అధికారులు వివరించారు.

దీర్ఘకాల రాబడి

నాలుగేళ్లపాటు పామ్ ఆయిల్ తోటలను జాగ్రత్తగా పెంచితే ఆ తరువాత 30 ఏళ్లపాటు రైతుకు నిరంతర లాభాలను తెచ్చిపెడుతుంది. నేల సారాన్ని బట్టి ఎకరాలకు 8 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. దీంతోపాటు ఎలాంటి చీడపీడల బెడద ఉండదు. నీటి వసతి అనుకూలంగా ఉన్న వారు బోరు బావుల కింద సాగు చేసుకోవచ్చు. సాధారణంగా ఒక ఎకరం వరిసాగుకు అవసరమయ్యే నీటితో 3,4 ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగు చేసుకోవచ్చు. అలాగే మొదటి నాలుగేళ్లలో అంతర్ పంటల సాగుతో రైతులు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చు. కాగా ప్రస్తుతం టన్ను ధర సుమారు 17 వేలు ఉంది.

సాగు విస్తరణ పెంచేందుకు...

ఆయిల్‌పామ్‌ను ఎంపిక చేసిన ఐదు మండలాలైన బి.మఠం, మైదుకూరు, పొద్దుటూరు, కాశినాయన, పులివెందుల మండలాలతోపాటు వీన్‌పల్లి, వేముల, లింగాల, పోరుమామిళ్ల, మైలవరం, సిద్దవటం, దువ్వూరు మండలాల్లో కూడా విస్తరణను పెంచేందుకు ఉద్యానశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఉన్నతాధికారులు నుంచి అనుమతి రాగానే ఈ ఏడు మండలాల్లో కూడా సాగును చేపట్టనున్నారు.



ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, కంపెనీ ప్రతినిధులు

సాగుకు నాలుగేళ్లపాటు ఆర్థికసాయం

ఆయిల్ పాం సాగు ప్రోత్సాహం కోసం ప్రభుత్వం రైతులకు నాలుగేళ్లకు రాయితీ కింద రూ. 71 వేలు ఆర్థిక సాయాన్ని అందచేయనుంది. ఇందులో రూ. 29 వేలు మొక్కలకు, ఎరువులు మెయింటనెన్స్ కోసం ఏడాదికి 5240 రూపాయల చొప్పున నాలుగేళ్లపాటు రూ. 21 వేలు, అలాగే అంతర్ పంటలసాగుకు హెక్టార్లకు 5250తో నాలుగేళ్లపాటు 21 వేలు అందించనుంది ఇలా మొత్తంగా నాలుగేళ్ల హెక్టారుకు రూ.71 వేలు ఆర్థికసాయం అందించనుంది.



ఆయిల్‌పాంలో అంతర్‌పంటగా సాగు చేసిన అరటి

ఆయిల్ పాం సాగుతో లాభాలు



ఆయిల్ పామ్ తోటల సాగు రైతన్నలకు చాలా బాగుంటుంది. వీటి సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయం సమకూరుతుంది. నకిలీ మొక్కలు కాకుండా ప్రభుత్వం ద్వారా వచ్చే మొక్కలను తెచ్చుకుని సాగు చేసుకోవాలి. వీటితో పాటు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు,సూచనలను ఇస్తూ ప్రభుత్వ పరంగా అండగా నిలుస్తున్నాం.

– సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: కిశోర బాలికలు మానసికంగా, శారీరకంగా పరిపూర్ణ మహిళగా ఎదిగితేనే అన్ని రకాలుగా ఆరోగ్యకరమైన భావితరాన్ని, సమాజాన్ని అందివ్వగలుగుతారని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కిశోరీ వికాసం'పై జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ విలువలను పెంపొందించేలా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. టీనేజ్ బాలికలపై వారి చుట్టూ ఉన్న వారి ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఈ వయస్సు బాలికలకు శారీరక, మానసిక స్థితిపై ఖచ్చితంగా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం గ్రామస్థాయిలో మనకు చేరువలో ఉన్న మహిళా పోలీసు, ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన కౌన్సిలర్లు ఆ ప్రాంతంలోని కిశోరి బాలికలతో ఒక గ్రూపు తయారుచేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేయాలన్నారు. వారితో స్నేహ పూర్వకంగా ఉంటూనే వారి శారీరక, మానసిక స్థితిగతులపై ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇంటి పరిధిలో అందుబాటులో ఉన్న 23,000 మంది కిశోరి బాలికలను గుర్తించామన్నారు వీరికి అవగాహన కల్పించే క్రమంలో కిశోరీ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. మహిళలపై, చిన్నపిల్లలపై వేధింపులు, బాల్య వివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు, నేరాలను అరికట్టే దిశగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. మహిళలూ, చిన్నారులపై లైంగిక దాడులు, నేరాలు, అఘాయిత్యాలు సంబంధిత కేసుల నమోదు శాతాన్ని '0' స్థాయికి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి కిశోర బాలికల వికాసంపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఐసీడీఎస్ ఆర్జేడీ రోహిణి, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, డీఈవో మీనాక్షి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, సఖి సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు, ప్రత్యేక పబ్లిక్ ప్రాసికూటర్లు, సఖి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆస్పత్రుల ప్రభుత్వ, వైద్యులు, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్య శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందని.. వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలోని మొత్తం 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు రాబోవు మూడు నెలలకు ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను తయారు చేసుకొని వచ్చే సమావేశంలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు. అనిమియా ఎక్కువగా ఉన్న వేంపల్లి, పోరుమామిళ్ల, చాపాడు వంటి రీజియన్ల పై ప్రత్యేక దష్టి సారించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, డీఐఓ హిమదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ బాలంజనేయులు,డీసీహెచ్ఎస్ ఇన్చార్జి కరిముల్ల, జీజీహెచ్ ఇన్చార్జి సూపరింటెంట్ నూకరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ఉమా మహేశ్వర రావు, మల్లేష్,ఖాజా మొయినుద్దీన్, శాంతి కళ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా పరవళ్లు!



మైలవరం జలాశయం నుంచి విడుదల అవుతున్న నీరు

- ఈ రెండు నెలల్లోనే 14.9 టీఎంసీల నీటి ప్రవాహం
- 2021లో నీటి ప్రవాహం ఇప్పటికీ రికార్డే

జమ్మలమడుగు: పెన్నానదిలో ఈ ఏడాదిలో అత్యధికంగా 14.9 టీఎంసీల నీరు ప్రవహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయంలోకి నీటి విడుదల చేస్తూ వచ్చారు. నిజానికి జిల్లాలో ఈ ఏడాది సరైన వర్షాలు పడకున్నా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గాలేరు-నగరి వరద కాలువ ద్వారా భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో మైలవరం ప్రాజెక్టు నుంచి పెన్నానదిలోనికి భారీగా నీరు విడుదల చేశారు. రెండు నెలల్లో దాదాపు 15 టీఎంసీల నీరు విడుదల చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

నాలుగేళ్లలో 112టీఎంసీల ప్రవాహం..

మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి రికార్డు స్థాయిలో వరద నీరు ప్రవహించింది. 2020 నుంచి 2024 వరకు 112 టీఎంసీల నీరు పెన్నానదిలోనికి విడుదల చేశారు. 2021 నవంబర్ నెలలో ఏకంగా లక్షా 55వేల క్యూసెక్కుల నీరు పెన్నానదిలో ప్రవహించి రికార్డుగా నిలిచింది. ఇక అత్యల్పంగా 2023లో ఏడు టీఎంసీల నీరు ప్రవహించింది. 2020లో 31 టీఎంసీలు, 22లో 16టీఎంసీలు, 24నవంబర్ వరకు దాదాపు 15టీఎంసీల నీరు ప్రవహించింది. ప్రస్తుతం నీటి ప్రవాహం వల్ల పెన్నానదిలో బోర్లు రీచార్జ్ అవ్వడంతోపాటు, వ్యవసాయ బోర్లకు నీరు లభ్యత పెరిగింది. పెన్నానది పరీవాహక ప్రజలకు తాగునీటి సమస్య కొంత వరకు తగ్గిపోయింది.

సంవత్సరం	విడుదల అయిన నీరు
2020	31టీఎంసీలు
2021	48.5టీఎంసీలు
2022	16టీఎంసీలు
2023	07టీఎంసీలు
2024నవంబర్	14.9 టీఎంసీలు

మైలవరంలో ఆరు టీఎంసీల నీరు నిల్వ...

మైలవరం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 6.5టీఎంసీ కాగా ప్రస్తుతం జలాశయంలో ఆరు టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉంది. గత సెప్టెంబర్ మొదటి వారం వరకు మైలవరం జలాశయం డెడ్‌స్టోరేజి వచ్చే పరిస్థితి ఉండది. వరద నీటితో ఇప్పుడు పూర్తిస్థాయి నీటి మట్టం వరకు వచ్చింది. మైలవరం జలాశయం కింద సాగుచేసే పంటలకు రబీసీజన్‌లో నీటి సమస్య తలెత్తినప్పుడు పంటలకు నీరు అందించటానికి కూడా ఆస్కారం వచ్చింది.

14.9 టీఎంసీల నీరు విడుదల చేశాం

మైలవరం జలాశయం నుంచి రెండు నెలల కాలంలో పెన్నానదికి 14.9టీఎంసీల నీరు విడుదల చేశాం. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 6.1టీఎంసీల నీరు నిల్వ ఉంది. రాబోయే రోజుల్లో వర్షాలు పడి జలాశయంలోనికి నీరు వస్తే మళ్లీ పెన్నాలోనికి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి.

– మూర్తి, డీఈఈ, మైలవరం జలాశయం


ఘనంగా జులూస్



మాసాపేట సర్కిల్‌లో భారీగా హాజరైన భక్తులు



అమీన్‌పీర్ పెద్దదర్గా జులూస్ (ర్యాలీ)లో గజమాలతో పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీని సత్కరిస్తున్న శిష్య బృందం



ఆకాశంలో తారాజువ్వలు

కడప కల్చరల్: ఐదు రోజులపాటు జరిగిన కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా దర్గా పీఠాధిపతి హాజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ బుధవారం రాత్రి నగరోత్సవాన్ని కడప నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఉదయం ఫకీర్లు, ఇతర శిష్య గణాలతో కలిసి పీఠాధిపతి పెద్దదర్గా నుంచి పెన్నానది అటువైపు తీరాన గల గండి వాటర్ వర్క్స్ కొండ గుహల వద్దకు వెళ్లి జెండా ప్రతిష్ఠించి ఫాతెహా నిర్వహించారు. తర్వాత ఆ ప్రాంతంలో హాజరత్ మస్తాన్ స్వామి స్మారకంగా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం అక్కడి నుంచి ఊరేగింపుగా కడప నగరానికి తిరిగి వచ్చారు. పలు వాహనాలలో ఆయన శిష్యులు, ప్రముఖులు ఆయన వెంట వాహనాలలో ఊరేగింపులో పాల్గొన్నారు. రాత్రి మాసాపేటలోని హాజరత్ మై అల్లా దర్గా షరీఫ్ వద్ద నుంచి పీఠాధిపతి ఫకీర్లు, సంఘ ప్రతినిధులతో కనుల పండువగా విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై నగరంలో ఊరేగింపుగా బయలుదేరారు. ముస్లిమేతరులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అడుగడుగునా యువకుల బృందాలు ఆయనకు స్వాగతం పలికి ఆశీస్సులు పొందారు. ఆయనను దర్శించుకునేందుకు భక్తులు వెల్లువెత్తారు. నగరంలోని పలు ముఖ్య కూడళ్ల ద్వారా సాగిన ఈ ఊరేగింపులో అడుగడుగునా యువత బ్యాండు మేళాల సంగీతానికి యువకులు తమ ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ నృత్యాలు చేశారు. ఊరేగింపు తెల్లవారుజామున తిరిగి దర్గాకు చేరింది.

చేనేత క్లస్టర్ ప్రహరీ పనుల పరిశీలన



చేనేత క్లస్టర్ ప్రహరీ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ రాజారత్నం

సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని ఎస్కేఆర్ నగర్‌లోని చేనేత క్లస్టర్ ప్రహరీ పనులను బుధవారం హౌసింగ్ పీడీ రాజారత్నం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ టెండర్ ద్వారా రూ. 49 లక్షలకు బద్వేల్‌కు చెందిన ఓబుల్‌రెడ్డి పనులు చేయడానికి టెండర్ దక్కించుకున్నారన్నారు. చేనేత క్లస్టర్ చుట్టూ ప్రహరీ, బిల్డింగ్ పనులు, టాయిలెట్ గదులు, మెయిన్‌టెనెన్స్ పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. స్థానిక కమిటీ సభ్యుడు గంజి సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ చెన్నయ్య పాల్గొన్నారు.

ముందస్తు జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : ఉమ్మడి జిల్లా పరిధిలోని పోలీసు అధికారులతో కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ముందస్తు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్‌తో పాటు, వైఎస్‌ఆర్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, డీఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పర్మిట్ రూంలకు అనుమతి లేదు

- షాపుల్లో కూర్చోబెట్టి మద్యం తాగిస్తే కేసులు నమోదు చేస్తాం
- ఉమ్మడి కడప జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


గోడౌన్‌లో మద్యం స్టాకును పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ జయరాజ్

ప్రొద్దుటూరు క్రైం : వైన్ షాపుల్లో కూర్చోబెట్టి మద్యం తాగిస్తే కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి కడప జిల్లా డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ జయరాజ్ తెలిపారు. ప్రొద్దుటూరులోని లిక్కర్ డిపోను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గోడౌన్‌లోని లిక్కర్ నిల్వలను పరిశీలించారు. లిక్కర్, బీరు కేసులు ఎంతమేర స్టాకు ఉన్నాయని డీఎం తిమ్మనాయుడును అడిగి తెలుసుకున్నారు. పాత స్టాకును డీసీ పరిశీలించారు. మద్యం షాపులకు పంపించే లిక్కర్ విషయంలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. డిమాండ్ బ్రాండ్లను కోటా ప్రకారం పంపిణీ చేయాలన్నారు. నిబంధనలు పాటించని మద్యం షాపులు, బార్లపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. మద్యం షాపులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. పర్మిట్ రూంలకు అనుమతి లేదని, అక్కడే కూర్చోబెట్టి మద్యం తాగించే షాపులపై కేసులు నమోదు చేయాలన్నారు. బెల్ట్ షాపులు పెట్టకుండా రోజు తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని మద్యం షాపులకు పర్మినెంట్ లైసెన్సుల జారీ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు తెలిపారు. లైసెన్సుల జారీ సమయాన్ని గురువారం వరకు పొడిగించినట్లు డీసీ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని మద్యం షాపుల్లో కల్తీకి ఆస్కారం లేకుండా ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు.

మద్యం షాపులతో నష్టపోతున్నాం: డీసీకి మొరపెట్టుకున్న బార్‌ల నిర్వాహకులు

అనుమతి లేకున్నా మద్యం షాపుల్లో కూర్చోబెట్టి తాపుతున్నారని ప్రొద్దుటూరులోని బార్‌ల యజమానులు డీసీ జయరాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ స్టేషన్‌ను డీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా బార్ల యజమానులు డీసీని కలిసి మాట్లాడారు. అనుమతి లేకున్నా మద్యం షాపుల్లో బార్లను తలపించేలా టేబుళ్లను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నో సార్లు స్థానిక ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. అనధికార పర్మిట్ రూంల వల్ల రోజు వారి వ్యాపారం సగానికి పైగా పడిపోయినట్లు వారు డీసీ వద్ద వాపోయారు. రోజు రూ. 1.50 లక్షలు పైగా నష్టం వస్తోందని, సిబ్బందికి జీతాలు, రూంలకు బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. వైన్ షాపుల చర్యలను నియంత్రించకుంటే బార్లను వదిలేయాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. దాడులు నిర్వహించి వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని డీసీ వారికి హామీ ఇచ్చారు.

బెల్టుషాపులను అరికట్టాలి

ముద్దనూరు : బెల్టుషాపులు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం విక్రయించాలని, ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎక్సైజ్ స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- పాత కక్షలే హత్యకు కారణం
- వివరాలు వెల్లడించిన అర్బన్ సీఐ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : సుమారు మూడు నెలల క్రితం జరిగిన ఓ ఘర్షణలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందిన మంచాల వెంకటయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం చాబోలు గ్రామానికి చెందిన మంచాల వెంకటయ్య (38) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఈయన చెల్లెలిని బద్వేలు మండలం అబ్బుసాహెబ్‌పేట గ్రామానికి చెందిన గొడుగునూరు క్రిష్ణయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే ఇరువురు మనస్పర్థలతో విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. ఇదే సమయంలో మైదుకూరు మండలం జాండ్లవరం గ్రామానికి చెందిన చెప్పలి దినేష్ తల్లితో వెంకటయ్య చనువుగా ఉంటుండేవాడు క్రిష్ణయ్య ఈ విషయాన్ని తెలుసుకుని దినేష్‌కు సమాచారం చేరవేశాడు. దీంతో దినేష్ వెంకటయ్యపై కక్ష పెంచుకుని క్రిష్ణయ్య సహకారంతో వెంకటయ్యపై దాడి చేసేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 11వ తేదీన పట్టణంలోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో వెంకటయ్యపై ఇరువురు కలిసి దాడి చేశారు. తిరిగి 13వ తేదీన అబ్బుసాహెబ్‌పేట గ్రామానికి వెళ్లి వెంకటయ్యపై మళ్లీ దాడి చేసి కత్తితో పొడిచారు. అప్పట్లో ఈ విషయమై అదే నెల 15వ తేదీన అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తీవ్ర గాయాలపాలైన వెంకటయ్య నెల్లూరు, కడపలో చికిత్స చేయించుకుంటూ ఈ నెల 15న కడప రిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందాడు. అయితే తన కుమారుడి మృతికి క్రిష్ణయ్య, దినేష్‌లే కారణమని మృతుని తండ్రి చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి కేసును హత్య కేసుగా మార్చుకుని నిందితులను పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన పీఈటీ

ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు


ప్రిన్సిపల్‌తో వాగ్వాదానికి దిగిన తల్లిదండ్రులు

కమలాపురం : స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అను అనే విద్యార్థిని పీఈటీగా పని చేస్తున్న చంద్రకళావతి చితక బాదిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 18వ తేదీన ఇంటర్మీడియట్ విద్యార్థులు అన్నం తిన్న తర్వాత అరటి తొక్కలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూసేందుకు కేర్ టేకర్‌గా అను అనే విద్యార్థిని మరో ఉపాధ్యాయురాలు నియమించారు. అయితే అక్కడున్న పీఈటీ చంద్ర కళావతి నీకు ఇంటర్మీడియట్ విద్యార్థుల వద్ద ఏం పని ఉందని వీపు పై చితక బాదారు. అలాగే చెంప మీద కొట్టబోయారు. ఆ సమయంలో అను చేయి అడ్డం పెట్టడంతో గాజు తగులుకుని విద్యార్థిని చేతికి గాయమైంది. అలాగే చేయి కూడా నొప్పిగా ఉందని బాధిత విద్యార్థిని కన్నీటి పర్యంతమైంది. విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు బ్రహ్మయ్య, గంగాదేవిలు బుధవారం పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. సోమవారం ఘటన జరిగితే మంగళవారం సాయంత్రం వరకు తమకు సమాచారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పీఈటీకి కొట్టే బాధ్యత ఎవరిచ్చారని వారు ప్రశ్నించారు. నెల రోజుల క్రితం ఇదే పాఠశాలలో చదువుతున్న చిన్న కుమార్తె గీతాంజలి బాత్ రూంలో జారి పడి చేయి విరిగిందని, అప్పుడు కూడా వారం రోజులకు సమాచారం ఇచ్చారని, అప్పుడు తాము హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య సేవలు అందించామన్నారు. కాగా, పాఠశాలలో ఉన్న ఇద్దరు పీఈటీల మధ్య మనస్పర్థలే ఇందుకు కారణం అని విశ్వసనీయం సమాచారం. పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ ఇద్దరు పీఈటీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా డీసీఓకు వారిని సరెండర్ చేయాలన్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ తులశమ్మను వివరణ కోరగా విద్యార్థినిని కొట్టిన మాట వాస్తవమేనని, అయితే విద్యార్థిని చేయి అడ్డం పెట్టడం వలన చేతికి చిన్న గాయం అయిందన్నారు. అప్పుడే ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించామన్నారు. ఘర్షణకు కారణమైన ఇద్దరు పీఈటీలకు షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు.

శాసనమండలిలో సీమ గళం


శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి బుధవారం జరిగిన శాసనమండలి సమావేశంలో రాయలసీమ సమస్యలపై చర్చించారు. ఇందులో భాగంగా కర్నూలు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, విద్యుత్ రెగ్యులేటరీ సంస్థలను వేరే ప్రాంతానికి తరలిస్తున్న విషయంపై ప్రజల ఆందోళన చెందుతున్నారని ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. అలాగే జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం కర్నూలులో ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం 273 ఎకరాల్లో రూ.1000 కోట్లతో శంకుస్థాపన చేసిందన్నారు. ఆ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలపాలని కోరారు.

మేకల గొంతు కోసిన గుర్తు తెలియని వ్యక్తులు

సింహాద్రిపురం : నాలుగు మేకలకు గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గొర్రెల యజమాని తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన కొమ్మెర రాజప్పకు చెందిన గొర్రెల గుంపును బుధవారం గొర్రెల దొడ్డిలో ఉంచి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. భోజనం చేసి తిరిగి వెళ్లేలోపు ఈ ఘటన చోటు చేసుకుంది. దాదాపు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు గొర్రెల యజమాని వాపోయాడు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడిన పరమేశ్వర్


మృతి చెందిన నారాయణ

బి.కోడూరు : బి.మఠం మండలం రాణిబావి టోల్‌గేట్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వెళ్లిపోయిన నారాయణ (45) అనే వ్యక్తి మృతి చెందగా పరమేశ్వర్ పరిస్థితి విషమంగా ఉంది. ఒకే కుటుంబానికి చెందిన వారు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నారాయణ, పరమేశ్వర్‌లు బుధవారం వ్యాపార నిమిత్తం మైదుకూరుకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాణిబావి సమీపంలోని టోల్‌గేట్ దగ్గర బద్వేలు నుంచి మైదుకూరుకు అతివేగంగా వెళుతున్న లారీ వారిని ఢీకొంది. దీంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పరమేశ్వర్ పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. నారాయణకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషిస్తూ ఉన్న నారాయణ మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న బి.మఠం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శంకుస్థాపనలకే పరిమితమైన కడప స్టీల్ ప్లాంట్

కడప సెవెన్‌రోడ్స్ : కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వాలు శంకుస్థాపనలకే పరిమితం చేశాయని, ఇంకా జాప్యం చేస్తే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కడప పర్యటనలో భాగంగా ఆమె కలెక్టర్ శ్రీధర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత పాలకుల నిర్వాకంతో స్టీల్ ప్లాంటు నిర్మాణం 'చెల్లి పెళ్లి జరగాలి మళ్లీమళ్లీ' అన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. టెంకాయ కొట్టేందుకే ప్లాంటు నిర్మాణాన్ని పరిమితం చేశారని ఆరోపిస్తూ అందుకు నిరసనగా ఆమె టెంకాయ కొట్టారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ పాటికి స్టీల్ ప్లాంటు పూర్తి చేసేదన్నారు. 2014 నుంచి బీజేపీ ఒక్క విభజన హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ఇతర నేతలు పాల్గొన్నారు. కాగా, బుధవారం ఉదయం వైఎస్సార్ సమాధి వద్ద షర్మిల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఇసుక తీసుకెళ్తున్న వారిని అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు


ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

వేంపల్లె : ఇంటి అవసరాలకు ఇసుక తీసుకెళ్తున్న వారిని టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. వివరాలు ఇలా.. మండలంలోని గ్రామాల వారు ఇంటి అవసరాల కోసం ఇసుకను తీసుకెళ్లవచ్చని తహసీల్దార్ హరినాథ్ రెడ్డి సూచించారు. అయితే గ్రామ సచివాలయాలలో తమ ఇంటి నిర్మాణం కోసం ఇసుకను తీసుకెళ్తున్నట్లు అర్జీ పెట్టుకోవాలన్నారు. వారికి సచివాలయ సిబ్బంది కూపన్ ఇస్తారని తెలిపారు. కాగా కూపన్ తీసుకొని వస్తున్న ట్రాక్టర్లను కూడా తీసుకెళ్లనీయకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. బుధవారం ఉదయం పాపాఘ్ని నదిలో ఇసుకను తీసుకెళ్తున్న 10 ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో ఇసుకను తరలిస్తే తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది పడతామని సాకు చెబుతున్నారు. రాత్రివేళల్లో మాత్రం యథేచ్ఛగా టీడీపీ నాయకులు ఇసుకను తరలించడం గమనార్హం. వీరు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంటి అవసరాల కోసం లబ్ధిదారులు ఇసుకను తీసుకువెళ్లొద్దని అడ్డుకోవడం... రెవెన్యూ అధికారులకు పట్టించి జరిమానాలు విధించడం చేస్తున్నారని కొందరు ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణలో అక్రమాలపై జేసీ విచారణ


రైతులను విచారిస్తున్న జేసీ అదితిసింగ్

పోరుమామిళ్ల : బెంగళూరు - అమరావతి (వయా అనంతపురం, శింగరాయకొండ) సిక్స్ వే ఎన్‌హెచ్167బీ జాతీయ రహదారి నిర్మాణం కోసం జరిగిన భూసేకరణలో అక్రమాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ విచారణ చేపట్టారు. ఈమేరకు జరుగుతున్న పనులను పరిశీలించేందుకు బుధవారం ఆమె మండలానికి వచ్చారు. బొప్పాపురం, చెన్నారెడ్డిపేట, పేరమ్మగారిపల్లెతో పాటు బి.మఠం మండల పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు రోడ్డు నిర్మాణంలో తమ భూములు పోయాయని, నష్టపరిహారం మాత్రం సిద్దు గురివిరెడ్డికి ఇచ్చారని జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరికొందరు తమకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. రైతుల ఫిర్యాదుతో జేసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు వాస్తవంగా కోల్పోయిన రైతుల వివరాలు తనకు పంపితే పరిహారం మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక, సామాజిక ఉన్నతికి గ్రంథాలయాల తోడ్పాటు

ముగిసిన జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి

కడప కల్చరల్ : గ్రంథాలయాలు మనిషి మానసిక సామాజిక వికాసానికి ఎంతగానో తోడ్పడగలవని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను బుధవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాన్ని మించిన గురువు, మిత్రుడు మరొకరు ఉండరని అవి జీవితానికి అవసరమైన విలువలను నేర్పుతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ కార్యదర్శి నివేదిక సమర్పించారు. సభాధ్యక్షుడు విద్యావేత్త అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పుస్తక పఠనం మానవతా విలువలను నేర్పుతుందన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సెల్‌ఫోన్ల వల్ల బాలలకు కీడే జరుగుతోందని, పుస్తక పఠనమే మంచి మార్గమని అభిప్రాయపడ్డారు. జిల్లా ఆడిట్ అధికారి పి.మంజులవాణి, వయోజన విద్యాధికారి మల్లు సుబ్బారెడ్డి మాట్లాడారు.

బహుమతి ప్రదానం

ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలలో వారం రోజులపాటు హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది బాబ్జి, సుబ్రమణ్యం, పవన్ కుమార్, రాజ్ కుమార్, శ్రీనివాసచారి, మనోహర్ అతిథులను సత్కరించారు.పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పందుల తరలింపులో ఉద్రిక్తత

- పోలీసులు, మున్సిపల్ అధికారులపై రాళ్లదాడి


పందులు తరలిస్తున్న వారిపై దాడి చేస్తున్న పందుల యజమానులు

జమ్మలమడుగు : పందుల తరలింపులో పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, మున్సిపల్ సిబ్బందిపై పందుల యజమానులు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం ముద్దనూరు రోడ్డులో రిపబ్లిక్ క్లబ్బు సమీపంలో జరిగింది. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా పందులను తరలించాలని మున్సిపల్ అధికారులు పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చారు. నెలరోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి నోటీసులు ఇవ్వడంతోపాటు వారం రోజుల క్రితం స్వయంగా వెళ్లి పందులను తరలించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా పందుల పెంపకందారులు స్పందించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు పట్టణంలోని పందులను పట్టుకుని తరలించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పందుల యజమానులు, మహిళలు ఒక్కసారిగా ముద్దనూరు రహదారిలో ఉన్న మినీ లారీపై దాడి చేశారు. సీసాలలో పెట్రోల్ తీసుకుని వచ్చి వాహనంపై పోసి నిప్పు అంటించారు. అడ్డుకున్న పోలీసులపై రాళ్లతో దాడికి దిగారు.


డ్రైవర్‌కు తీవ్ర గాయాలు..


తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ప్రసాద్

పందులను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నంలో పందుల యజమానులు ఒక్కసారిగా పెట్రోల్ బాటిళ్లతో దాడి చేసి మినీలారీకి నిప్పుపెట్టడంతో డ్రైవర్ ప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పేశారు. గాయపడిన డ్రైవర్‌ను జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు మినీలారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తాం

ఆర్ఎం గోపాల్‌రెడ్డి


డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు తెలిపారు.

- సాయంత్రం 6 గంటల తర్వాత చిన్నమండెం బస్టాండులోకి మదనపల్లె, పుంగనూరు బస్సులు రావడం లేదని స్థానికుడైన పెద్దిరెడ్డి తెలిపారు.
- కడప కార్గోలో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు బుకింగ్ సందర్భంగా విపరీతమైన రద్దీ దృష్ట్యా అదనపు బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని నగరానికి చెందిన రామయ్య, పెంచలయ్యకోరారు.
- సిద్దయ్యగారి మఠానికి బస్సులు నడవడం లేదని కడపకు చెందిన వెంకట చలపతి కోరారు.
- కమలాపురం బస్టాండులో బస్సుల సమయాలను ఏర్పాటు చేయాలని రాజేశ్వర్‌రెడ్డి కోరారు.
- ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్యలో వేంపల్లె-నందిమండలం నుంచి పులివెందులకు పల్లె వెలుగు బస్సులు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాలకుచెందిన సతీష్, సుఫియాన్‌లు కోరారు.
- కడప-బెంగళూరు సర్వీసులను మదనపల్లె, చింతామణి బస్టాండుల మీదుగా నడపాలని, అలాగే బెంగళూరులోని సిల్క్ బోర్డు, యలహంక, వైట్ ఫీల్డ్, ఎలక్ట్రానిక్ సిటీ వరకు బస్సులు నడపాలని మదనపల్లెకు చెందిన సాయి శ్రీనివాస్ కోరారు.
- మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు తిరుగుతున్న పల్లె వెలుగు బస్సులు అల్లాడుపల్లె దేవళాలు మీదుగా నడపాలని సీతారాంపురానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి కోరారు.
- బద్వేలు, జమ్మలమడుగు డిపోల నుంచి విజయవాడకు వయా పామూరు, కందుకూరు మీదుగా బస్సు ఏర్పాటు చేయాలని, అలాగే పులివెందుల, నూజివీడు సర్వీసును వయా పామూరు, కందుకూరు మీదుగా, పులివెందుల నుంచి ఒంగోలుకు వయా పామూరు, కందుకూరు మీదుగా, కడప నుంచి మైదుకూరు, పామూరు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని పామూరుకు చెందిన విష్ణు, నరసింహారావులు కోరారు.